క్లుప్తంగా

నాణ్యతకు, మన్నికకు భారతి సిమెంట్



తెనాలిరూరల్: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంటు ఎంచుకోవాలని భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్(మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్. భవానీశంకర్ సూచించారు. బాపట్ల జిల్లా వేమూరు మండలం అవులవారిపాలెంలో శుక్రవారం రాత్రి శ్రీ సాంబశివ ట్రేడర్స్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందని వివరించారు. సిమెంటు తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందని తెలిపారు. భవానీశంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలను చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యజమానులకు వివరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధిత డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. సాంబశివ ట్రేడర్స్ యజమాని అంజయ్య, ఇతర డీలర్లు, భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



మున్నంగి(కొల్లిపర): పిల్లలు, పెద్దలు, యువత దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రధానోపాధ్యాయుడు రాము అన్నారు. శుక్రవారం మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల(ఆర్)లో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు ఎస్.లక్ష్మీకమల మాట్లాడుతూ టపాసులు కాల్చేటప్పుడు చెప్పులు తప్పకుండా వేసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని, పిల్లలు పెద్దల సమక్షంలో మాత్రమే కాల్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులు టపాసులు కాల్చించారు. బాలికలతో దీపాలు వెలిగించి దీపావళి ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భార్గవి పాల్గొన్నారు.

పాఠశాలకు స్టీల్ వాటర్ డ్రమ్ బహూకరణ

తెనాలిటౌన్: పట్టణ నాజర్‌పేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ డ్రమ్‌ను బహూకరించారు. క్లబ్ సెక్రటరీ నేరెళ్ళ వెంకట కృష్ణమోహనరావు పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు సాతులూరి రామ్‌ప్రసాద్, క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాదర్తి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీకుమార్, అయినాల మల్లేశ్వరరావు, కోణిజేటి రమేష్ కృష్ణ, సంకా తిరుమలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని, ఉపాధ్యాయులు ఎం.నాగలక్ష్మి, వరప్రసాద్ పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి: పట్టణ నెహ్రూరోడ్డులోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నారు. 20వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు, యువతకు వివిధ రకాల ప్రతిభా పోటీలను ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి కె.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి రూరల్ మండలం పెదరావూరులోని శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు 14 నుంచి నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు ఎ.రాఘవేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. 14న గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుక, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య సంస్మరణ, 17న కవి సమ్మేళనం/సదస్సులు, 18న వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్, ఆటల పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, రూరల్ గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగన్‌తోనే మంచి పాలన

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- బుర్రిపాలెంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమం



బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ప్రజలు సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోవాలంటే రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. వైఎస్ జగన్‌తోనే మంచి పాలన సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం బుర్రిపాలెంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమాలను తెలిపే బోర్డును సచివాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యమిస్తూ సుపరిపాలనను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ లబ్ధిని చేకూరుస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. బుర్రిపాలెం గ్రామంలోనే రూ. 22 కోట్లకు పైగా సంక్షేమ లబ్ధి చేకూరిందని వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి గ్రామంలోని పలువురి ఇళ్లకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కరపత్రాన్ని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన హామీలతో కూడిన కరపత్రాన్ని అందించి పథకాల గురించి అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి, గ్రామ సర్పంచి పరుచూరి విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రతాపరెడ్డి, నాయకులు అడుసుమల్లి అజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నాజర్‌పేట-1 సచివాలయం పరిధిలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పేద ప్రజలను అదుకునేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. అర్హులై ఉండి ఏదైనా పథకం అందకపోతే సంబంధిత సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. నాలుగో వార్డు సచివాలయ పరిధిలో రూ.13 కోట్ల సంక్షేమాలు అందించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం మాట్లాడారు.

కొల్లిపరలో పల్లె నిద్ర

కొల్లిపర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా కొల్లిపర మండలంలో శుక్రవారం రాత్రి సచివాలయం -2 పరిధిలో పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, నాయకులు పల్లె నిద్రలో భాగంగా కొల్లిపరలో బస చేశారు. కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, చెంచాల రామిరెడ్డి, అవుతు బ్రహ్మానందరెడ్డి, అన్నవరపు రమేష్, అవుతు శేఖర్ రెడ్డి, వంగా బూసిరెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజు పాల్గొన్నారు.



లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం



మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, వేదికపై ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి పేర్కొన్నారు. కొల్లిపరలోని గ్రామ సచివాలయం- 2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగనే మళ్లీ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా పల్లెకు పోదాం శుక్రవారం నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేశారు. అనంతరం ప్రజా ప్రతినిధులు సచివాలయ పరిధిలో ప్రజలకు చేకూరుతున్న లబ్ధి వివరాల బోర్డు ప్రదర్శించారు. పార్టీ నాయకులు సంక్షేమ పథకాల బ్రోచర్ అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో అభివృద్ధికి నిత్యం పాటు పడుతున్న ఎమ్మెల్యే శివకుమార్‌కు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి పిల్లి రాధిక, ఉప సర్పంచి అవుతు కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఎంపీటీసీ ఝాన్సీ, ఈఓపీఆర్డీ శంకరరావు, పార్టీ నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, అవుతు సాంబిరెడ్డి, కళ్ళం వీరారెడ్డి, అవుతు బ్రహ్మారెడ్డి, చెంచల రామిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సేవలు అందించాలి

ఎమ్మెల్యే శివకుమార్



గొర్రెల మండీ షెడ్డును ప్రారంభిస్తున్న యార్డు చైర్మన్ సీతనగేష్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. సుల్తానాబాద్‌లోని మార్కెట్ యార్డు ఆవరణలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన గొర్రెల మండీని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం యార్డు ఆవరణలో ఏర్పాటు చేయనున్న రైతు జోడు ఎద్దుల బండి చిహ్నంకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మార్కెట్ కమిటీల్లో ఎక్కడా లేని విధంగా తెనాలిలో రైతుల సందర్శనాదం రైతు జోడి ఎద్దుల చిహ్నం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఎక్కువగా సేవలు అందించాలని తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఐదో విడత రెండోసారి రైతు భరోసా నగదును తెనాలి, కొల్లిపర మండలాల్లో రూ.ఏడు కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని వ్యవసాయం చేయాలంటే రైతులకు కష్టంగా ఉందన్నారు. రైతులను అదుకోవడానికి ప్రభుత్వం రైతు భరోసా ద్వారా ఏడాదికి రెండు సార్లు నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన గిడ్డంగుల్లో రైతులు ధాన్యాన్ని నిల్వలు చేసుకుంటున్నారని, దీనివలన యార్డు అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో రూ.60లక్షలతో ప్రహరీ ఏర్పాటు, రూ.1.12 కోట్లతో యార్డు ఆవరణలో వివిధ అభివృద్ధి పనులు చేయడానికి తీర్మానం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అవుతు సీత నగేష్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వి.కృష్ణ, సెక్రటరీ జేవీ సుబ్బారావు, మున్సిపల్ ఇంజినీర్ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో బహుళ ప్రయోజనాలు



మాట్లాడుతున్న కె.రామచంద్రన్. వేదికపై రత్తయ్య, కుటుంబరెడ్డి, సాయిబాబు, ఉష

కొల్లిపర(తెనాలి): భూమిలోని సూక్ష్మజీవులు తగినంతగా విస్తరించినపుడే పంటలకు మేలు జరుగుతుందని, సూక్ష్మజీవులు లెక్కకు మిక్కిలిగా పెరగాలంటే వాటికి తగిన ఆహారం సేంద్రియ పదార్థాలతోనే సమకూరుతుందని, అందుచేత సేంద్రియ విధానంలో పంటల సాగుతోనే అన్నిరకాలుగా ప్రయోజనం కలుగుతుందని కె.రామచంద్రన్ చెప్పారు. జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల సాగులో భాగంగా మండల కేంద్రమైన కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పసుపు పంట సాగుపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. నీలగిరి ఫౌండేషన్ మేనేజర్ రత్తయ్య అధ్యక్షత వహించారు. మాస్టర్ ట్రైనర్ రామచంద్రన్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతిని పాటించాలని సూచించారు. పప్పులు, నూనెల జాతులకు సంబంధించిన 18 రకాల విత్తనాలను పచ్చిరొట్టగా వినియోగించాలని సలహానిచ్చారు. మరో మాస్టర్ ట్రైనర్ కె.సాయిబాబు మాట్లాడుతూ పంటచేలో భాస్వరాన్ని దుక్కిలోనే వేయటం మంచిదని చెప్పారు. రైతులు సొంతంగా వేపగింజల కషాయం తయారు చేసుకుని తరచూ పసుపు పైరుపై వాడినపుడు మంచి ప్రయోజనం ఉంటుందని వివరించారు. వేపగింజల కషాయం చల్లిన ఆకులపై పురుగులు గుడ్లు పెట్టవని చెబుతూ ఒకవేళ గుడ్లు పెట్టినప్పటికీ అవి చనిపోతాయని తెలిపారు. ఒకవేళ గుడ్లు సీతాకోకచిలుకలుగా మారినా, అవి తిరిగి గుడ్లు పెట్టలేవని చెప్పారు. దీనితో తెగుళ్ల ఆశించకుండా పైరు ఆరోగ్యంగా పెరుగుతుందని వివరించారు. ఉద్యాన శాఖ అధికారి ఉష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పసుపు పంటను గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(జీఏపీ)గా రైతులతో చేయిస్తున్నట్లు చెప్పారు. శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని 24 మంది రైతులు జీఏపీ విధానంలో పసుపు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారి వెంకట్రావు, హెచ్ఈఓ శ్రీధర్‌రెడ్డి, కృషి ఖాన్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ ప్రతినిధి ఎం.వంశీ మాట్లాడారు. సంఘం చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు వుయ్యూరు సాంబిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శిక్షణకు హాజరైన రైతులకు జీవన ఎరువును అందజేశారు.

కాటన్ సంచుల పంపిణీకి శ్రీకారం

- ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా..
- 10 వేల సంచుల పంపిణీకి చర్యలు



కాటన్ సంచులను ఆవిష్కరిస్తున్న కొత్త సుబ్రహ్మణ్యం, రామ్‌చంద్ తదితరులు

తెనాలి: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని మానవత స్వచ్ఛంద సంస్థ పిలుపునిచ్చింది. తమ వంతుగా 10 వేల కాటన్ సంచులను తయారు చేయించి పంపిణీ చేయనున్నట్లు సంస్థ బాధ్యులు తెలిపారు. తొలి విడతగా మూడు వేల కాటన్ సంచుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. స్థానిక కుమార్ పంప్స్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం కాటన్ సంచులను సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, పట్టణ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ఆవిష్కరించారు. కుమార్ పంప్స్, శాంతి షూ మార్ట్ సహకారంతో కాటన్ సంచులను కుట్టించి, పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు. మానవత ఆశయాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిలో భాగంగా కాటన్ సంచుల పంపిణీ ఒకటిగా తెలిపారు. ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు కూరపాటి కల్యాణి మాట్లాడుతూ విచ్చలవిడి ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి కలుగుతున్న అనర్థాలను వివరించారు. సమావేశంలో సంస్థ బాధ్యులు తన్నీరు శ్రీనివాస బాబు, డాక్టర్ జి.నాగేశ్వరరావు, చిట్టినేని సాంబశివరావు, కూరపాటి రవీంద్రనాథ్, వెంకట్, డీవీ సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు పేరు నమోదు చేసుకోవాలి

కార్మికశాఖ ఉప కార్మిక కమిషనర్ గాయత్రీదేవి



కార్డులను అందజేస్తున్న గాయత్రీదేవి

తెనాలి: భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు తమ పేరును కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేయించుకోవాలని కార్మిక శాఖ ఉపకార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి సూచించారు. ప్రతి ఒక అసంఘటిత కార్మికుడు తమ పేరును ఈ-శ్రమ పోర్టల్‌లో తప్పక నమోదు చేసుకోవాలని కోరారు. పట్టణంలోని 30వ వార్డులో శుక్రవారం భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులో పేర్ల నమోదు, ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ టి.అనూరాధ మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డులో పేర్లు నమోదుపై అవగాహన కల్పించారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన సదస్సులో గాయత్రిదేవి భవన నిర్మాణ కార్మికులకు పలు సూచనలు చేశారు. కార్మిక సంక్షేమ బోర్డులో చేరేందుకు, ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదుకు కావాల్సిన అర్హతలు, కలిగే ప్రయోజనాలను తెనాలి సహాయ కార్మిక అధికారి ఎం.వినయ్‌కుమార్ వివరించారు. భవనం లేదా ఇతర నిర్మాణ రంగ కార్మికులకు అర్హత ఉంటుందని, 18-60 ఏళ్ల వయసు కలిగి ఉండాలని చెప్పారు. ఈ-శ్రమ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు.ఇందులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి ఏడాదిపాటు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద మరణం/ అంగవైకల్యం బీమా ఉచితంగా లభిస్తుందని వివరించారు. నమోదు చేసుకున్న కార్మికులకు కార్డులను అందజేశారు.

రాజోలు నుంచి తెనాలికి బస్సు ఏర్పాటు చేయండి



ఫోన్‌లో మాట్లాడుతున్న డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: రాజోలు నుంచి తెనాలికి ఉదయం తొమ్మిది గంటల తరువాత బస్సు ఏర్పాటు చేయాలని రాజోలుకు చెందిన బి.వెంకటేశ్వర స్వామి, కె.కమలాకర్ గుప్తా, నిరంజన్‌రావు, సంపత్ బాబు విన్నవించారు. డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించారు. ప్రజలు నేరుగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు, సలహాలు తెలియజేశారు. వాటిలో తెనాలి- గుంటూరు బస్సులు ఉదయం సమయంలో ఆలస్యంగా నడుస్తున్నాయని, నగరం- తెనాలికి ఉదయం 10 గంటలకు బస్సును ఏర్పాటు చేయాలని, తెనాలి- గుంటూరుకు రాత్రి 10.30 గంటల తరువాత బస్సును ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. అలాగే దావులూరు పాలెం ఊరిలో నుంచి బస్సును నడపాలని, తెనాలి నుంచి ఒంగోలు, పొదిలి, కనిగిరికి బస్సును ఏర్పాటు చేయాలని, తెనాలి నుంచి ఎయిమ్స్ హాస్పిటల్‌కు ఉదయం 8.30 గంటలకు బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే తెనాలి నుంచి జీడిమెట్ల, అవనిగడ్డకు బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. వీటిన్నంటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా ఉన్నతాధికారుల అనుమతితో బస్సులను ఏర్పాటు చేస్తామని డీఎం హామీ ఇచ్చారు.

నేడు ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధన



పోస్టరు ఆవిష్కరించిన నిర్వాహకులు

తెనాలి: సంగీత జగద్గురు సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణ రామలింగేశ్వరపేటలోని దుర్గా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు. సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి సందర్భంగా ఆ రోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి రాత్రి 9 గంటల వరకు ఆరాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సంబంధిత పోస్టర్‌ను శుక్రవారం రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. దీక్షితార్‌పై విశేష పరిశోధన చేసిన కోవూరుకు చెందిన సంగీత సాహిత్య ప్రవీణ, శ్రుతి వాగ్గేయ కళానిధి డాక్టర్ యనమండ్ర శ్రీనివాస్‌శర్మ గాత్ర కచేరీ ఉంటుందని సంస్థ కన్వీనర్ కానూరి వెంకట రామకృష్ణ తెలిపారు. దీక్షితార్‌పై సోదాహరణ ప్రసంగంతో కూడిన కార్యక్రమానికి వయొలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై కేవీ రామకృష్ణ విద్యుసహకారం అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో పర్చూరు సుబ్బారావు, కొండపి శ్రీనివాసరావు, ఎస్వీ చంద్రశేఖర్, నల్లూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీనుల విందు చేసిన సంగీత విభావరి



గీతాలాపన చేస్తున్న శ్రీరామ్

తెనాలిరూరల్: హైదరాబాద్‌కు చెందిన యువ గాయకుడు జొన్నలగడ్డ శ్రీరామ్ సంగీత విభావరి సంగీతాభిమానులకు వీనుల విందు చేసింది. పట్టణానికి చెందిన ప్రఖ్యాత సంగీత సంస్థ సీతారామ గాన సభ వార్షిక సంగీతోత్సవాల్లో భాగంగా ఆఖరు రోజైన శుక్రవారం శ్రీరామ్ గీతాలాపన చేశారు. వాతాపి గణపతింభజే, సొగసు చూడ తరమా, జగదానంద కారక వంటి కీర్తనల ఆలాపన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. వీరికి వయొలిన్‌పై హైదరాబాద్‌కు చెందిన వాసు, మృదంగంపై చెన్నైకు చెందిన బుర్రా శ్రీరామ్ సహకరించారు. స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో తొలుత గానసభ మాజీ అధ్యక్షుడు పిరాట్ల నారాయణ మూర్తి సంతాప సభ నిర్వహించారు. పిరాట్ల రమణి, దుర్భా హరిబాబు శాస్త్రి, కేవీ రామకృష్ణ, పరుచూరి సుబ్బారావు, చింతలపాటి మంజుల, యశ్వంత్ పర్యవేక్షించారు.

సామాజిక సేవకు తోడ్పాటు

ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: సమాజంలో వెనుకబడిన ప్రజలకు ఫెడరేషన్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవకు తమ వంతు తోడ్పాటు అందిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని స్మామాట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జై భీమ్ ఫెడరేషన్ నాలుగో వార్షికోత్సవం నిర్వహించారు. సభకు ఫెడరేషన్ గౌరవ సలహాదారు కె.అబ్రహాంలింకన్ అధ్యక్షత వహించారు. సభలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కళెవరపు దేవయ్య(దేవానంద్) జన్మదినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా దేవయ్య, అమరావతి ఉద్యమ నాయకుడు ఎం.గురునాథలను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సభలో బిషప్ సుధీర్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు అక్కిదాసు కిరణ్, షేక్ సాయిబాబు, కొమ్మురాయల్, కాకి దేవసహాయం, డాక్టర్ రాజ్‌కుమార్, న్యాయవాది కొత్తపల్లి రవి మాట్లాడారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపసర్పంచుల పదవులకు ఎన్నిక

తెనాలిటౌన్: మండలంలో ఖాళీగా ఉన్న కఠెవరం, హాఫ్‌పేట, పెదరావూరు గ్రామాల ఉపసర్పంచులకు 16వ తేదీన ఆయా గ్రామాల పంచాయతీలలో ఎన్నిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో జరిగే సమావేశంలో వార్డు సభ్యులు ఉపసర్పంచ్‌లను ఎన్నుకుంటారని తెలిపారు. ఎన్నికల అధికారులుగా కఠెవరం గ్రామానికి పంచాయతీరాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, హాఫ్‌పేటకు ఎంఈఓ-1 మేకల లక్ష్మీనారాయణ, పెదరావూరుకు ఎంఈవో-2 జయంతిబాబులను నియమించినట్లు తెలిపారు.

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. సంపత్‌నగర్‌కు చెందిన రాజనాల శ్రీనివాసరావు అనుమతులు లేకుండా బాణసంచా దుకాణం పెట్టి విక్రయిస్తున్నాడు. తనిఖీలు నిర్వహించిన లాలాపేట పోలీసులు టపాసుల్ని స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ గెలుపులో భాగస్వాములు కండి



టీడీపీలో నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపులో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన రెండు, నాలుగు వార్డుల టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ అమీర్ బాషా ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే శివకుమార్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సీతమ్మ, నాయకులు శ్రీను, కోడూరు రమేష్‌బాబు, ప్రసాదం సురేష్‌కుమార్, వీరమల్లు కార్తీక్, షేక్ జానీ, తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలు లాటరీతో ఎంపిక

- పట్టణంలో అమ్మకాలకు 49 స్టాల్స్
- ఈసారి అమ్మకాలు వీఎస్సార్ కాలేజికి మార్పు



స్టాల్స్ కేటాయిస్తున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలి: పట్టణంలో దీపావళి బాణసంచా విక్రయాలకు లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మండల తహసీల్దార్ కె.రవిబాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 49 దుకాణాలకు దరఖాస్తులు రాగా, దరఖాస్తుదారుల సమక్షంలోనే లాటరీతో ఒక్కో దరఖాస్తుకు ఒక్కో తాత్కాలిక దుకాణాన్ని కేటాయించారు. ప్రతి ఏడాది కొత్తపేటలోని తాలూకా హైస్కూలు మైదానంలో బాణసంచా అమ్మకాలకు స్టాల్స్‌కు అనుమతించేవారు. తాలూకా హైస్కూలు మూసివేయటం, బాణసంచా అమ్మకాలకు ఎక్కువగా దరఖాస్తులు రావటంతో ఈసారి విక్రయాలను వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజికి మార్పు చేశారు. అక్కడ 49 స్టాల్స్ ఒకేచోట ఏర్పాటుకు విశాలమైన స్థలం అందుబాటులో ఉండటంతో ఈ ప్రదేశాన్ని ఎంపిక చేశారు. బాణసంచావిక్రయదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ కె.రవిబాబు స్పష్టంచేశారు. స్టాల్‌కు స్టాల్‌కు మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలని, ప్రతి స్టాల్ వద్ద ఇసుక బకెట్లు, నీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: కాళీమాత దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శివాజీ చౌక్‌లోని దేవస్థానం వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండోవ శుక్రవారం పేదలకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు యర్ర శ్రీనివాసరావు, కందేపి సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్‌లో దీపావళి వేడుకలు



తెనాలిఅర్బన్: దీపావళి వేడుకలను బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు టపాసులు కాల్చి సందండి చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 20 అడుగుల నరకాసుని బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.